

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
కర్నూలు నంద్యాల
సోమవారం | 13 అక్టోబరు 2025
పేజీలు 8

### శ్రీశైలం,కర్నూలులో పర్యటించనున్న

# మూడవ ప్రధాని మోడీ


కర్నూలులోని కొండారెడ్డి బురుజు

**సూర్య ప్రతినిధి,కర్నూలు :** భారతదేశ ప్రధానమంత్రి హోదాలో నరేంద్రమోడీ ఈ నెల 16న శ్రీశైలం, కర్నూలులో పర్యటిస్తే ఈ రెండు ప్రాంతాల్లో పర్యటించిన మూడవ ప్రధానిగా గుర్తింపు పొందనున్నారు. గతంలో శ్రీశైలం ప్రాజెక్టు శంకుస్థాపన నిమిత్తం నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1963 జూలై 24న శ్రీశైలంలో పర్యటించారు. ఆ తర్వాత ఆ ప్రాజెక్టు ప్రారంభోత్సవం కోసం ఆయన కుమార్తె మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1982 అక్టోబరు 29న శ్రీశైలం సందర్శించారు.వారిద్దరి తర్వాత మూడవ ప్రధానిగా ఈ నెల 16న

మిగతా 2లో


శ్రీశైలం మహా పుణ్యక్షేత్రం

- లక్ష్యం 2,500 మిలియన్ యూనిట్లు
- ఉత్పత్తి 3,400 మిలియన్ యూనిట్లు
- విద్యుత్ ఉత్పత్తి కోసం 596 టీఎంసీల నీరు
- తుంగభద్రనది నుండి శ్రీశైలం చేరింది 350 టీఎంసీలు
- జలాశయానికి 2129 టీఎంసీల వరదనీరు

## శ్రీశైలంలో లక్ష్యాన్ని మించి

# విద్యుత్ ఉత్పత్తి

**కర్నూలు/శ్రీశైలం, మేజర్‌న్యూస్‌బ్యూరో :** ఈ ఏడు శ్రీశైలం జలాశయం విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేశారు. భారీ వర్షాలతో కృష్ణా నది పరివాహక ప్రాంతం నుండి పెద్ద ఎత్తున వరద జలాలు శ్రీశైలం జలాశయం చేరడంతో ఇది సాధ్యమైంది. కుడి, ఎడమ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు రెండింటిలోనూ లక్ష్యాన్ని మించి విద్యుత్ ఉత్పత్తి చేయడం విశేషం.కుడి గట్టు(ఆంధ్రప్రదేశ్) విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఈ ఏడాది 1000 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యంగా

మిగతా 2లో


ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం


శ్రీశైలం జలాశయం

## ప్రధాని పర్యటనకు 7,300 మంది పోలీసులతో పకడ్బందీ భద్రత

- సభాప్రాంగణంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- భద్రతా ఏర్పాట్ల పై బందోబస్తు నిమిత్తం విచ్చేసిన సెక్టార్ పోలీస్ ఉన్నతాధికారులు,లైజనింగ్ ఆఫీసర్లు
- సమీక్ష నిర్వహించి దిశా నిర్ధేశం చేసిన ఎస్పీవిక్రాంత్ పాటిల్


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ప్రధాని మోడీ ఈ నెల 16న కర్నూలు పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పకడ్బందీ భద్రతా ఏర్పాట్ల గురించి బందోబస్తు నిమిత్తం వచ్చిన సెక్టార్, లైజనింగ్ పోలీసు అధికారులతో మాట్లాడి దిశా నిర్దేశం చేశారు. ఆదివారం మండలంలోని నన్నూరు దగ్గరున్న రాగమయూరి గ్రీన్ హిల్స్‌లో బహిరంగ సభ ప్రాంతం దగ్గర ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంలో ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అనంతరం పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పార్కింగ్ ప్రదేశాలు, రూట్ డైవర్షన్స్ గురించి, జియో గ్రాఫికల్ మ్యాప్‌ను చూపిస్తూ మాట్లాడారు. ప్రధాని పర్యటన నిమిత్తం 7,300మంది పోలీసు బలగాలను బందోబస్తుకు వినియోగిస్తున్నామన్నారు.

మిగతా 2లో

### అంతిమయాత్ర చేయాలంటే

## వాగు దాటాల్సిందే..!

➲ స్మశాన వాటికకు వెళ్లేందుకు వంతెన సౌకర్యం కల్పించండి


మృతదేహాన్ని ఖననం కోసం నది దాటుతూ తీసుకెళ్లుతున్న దృశ్యం

## శ్రీశైలం డ్యాం ఒక్క గేటు మూసివేత..!

2లో


శ్రీశైలం డ్యాం అన్ని గేట్లు మూసివేసిన దృశ్యం(ఫైల్‌ఫోటో)



# జస్టిస్ బిఆర్ గవాయ్ పై జరిగిన దాడి అమానుషం

**- దళిత ఐపీఎస్ అధికారి పురన్ కుమార్ మృతి బాధాకరం**
**- సాక్షాతూ భారత రాజ్యాంగంపై దాడి ..వెంకటేష్**
**- డాక్టర్ బిఆర్ .అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన**



**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్:** భారతదేశ అత్యున్నత న్యాయ స్థానం అయిన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ పై సుప్రీం కోర్టులో జరిగిన దాడి సంఘటన మరువక ముందే హర్యానా రాష్ట్రములో దళిత ఐ.పి.ఎస్ అధికారి పురన్ కుమార్ఉన్నతధికారుల కులవివక్షత, వేధింపులను భరించలేక ఆత్మ హత్య చేసుకోవడం చాలా బాధాకరమని నందికొట్కూరు తాలూకా మాల మహానాడు నాయకులు డాక్టర్ దాసరి వెంకటేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మిడుతూరు రోడ్డు లోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు నాయకులు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంచేపట్టారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ న్యాయ వ్యవస్థను ప్రతిబింబించే వస్త్రధారణలో ఉన్న న్యాయవాది,లాయర్ రాకేష్ కిషోర్,కోర్టులో ప్రధాన న్యాయమూర్తిపై చెప్పు విసరడం అనేది కేవలం వ్యక్తిపై దాడి కాదు ఇది సాక్షాత్తు భారత రాజ్యాంగంపై దాడి చేసినట్లేనన్నారు. రాష్ట్రపతి మరియు కేంద్ర ప్రభుత్వం వెంటనే దర్యాప్తు చేపట్టి దోషులను అత్యంత కఠినంగా శిక్షించాలని భవిష్యత్తులో ఇలాంటి దాడులకు పాల్పడకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని మరియు జాతీయ ఎస్సి కమిషన్ ను డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు తాలూకా మాల మహానాడు నాయకులు పెరుమాళ్ళ మధు, శ్రీను,నాగేంద్ర, ధర్మరాజు, భక్షాలు, రవి, ఏసురత్నం, ప్రకాష్ రావు, విజయరాజు నతనీయులు తదితరులు పాల్గొన్నారు.

# ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**-ఇస్కాల గ్రామంలో విషాద ఘటన**



**పాములపాడు మేజర్ న్యూస్ :** మండలంలోని ఇస్కాల గ్రామం లో ఆదివారం ఉదయం దుర దృష్టకర సంఘటన చోటు చేసుకుంది. కుటుంబ కలహాల కారణంగా జయరాజు (40) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు.బంధువుల వివరాల ప్రకారం, జయరాజు స్వగ్రామం ఆత్మకూరు మండ లంలోని పెద్ద అనంతపురం గ్రామం. మూడు రోజుల క్రితం భార్య లక్ష్మీదేవితో వివాదం ఏర్పడి, ఆమె తన పుట్టింటి గ్రామమైన ఇస్కాలకు వచ్చింది. భార్యను ఇంటికి తీసుకువెళ్లేం దుకు జయరాజు ఇస్కాల గ్రామానికి వచ్చినప్పటికీ, మళ్లీ ఇద్దరి మధ్య గొడవ చెలరేగిం ది. అనంతరం భార్య వ్యవసా య పనుల నిమిత్తం తెలంగాణ రాష్ట్రంకు కు వెళ్లింది.దీంతో మనస్థాపానికిగురైన జయరాజు ఆదివారంఉదయంఉరి వేసుకు న్నాడు. గమనించిన స్థానికులు అతన్ని ఉరితీయగా కిందకు దించారు. కొద్దిసేపు ఊపిరి ఉన్నప్పటికీ, అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. మృతుడికి ముగ్గురు మగ పిల్ల లు ఉన్నారు. ఈ ఘటనపై మృ తుడి తల్లి దీవెనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రమణ తెలిపారు.

# క్రీడలు శారీరక మానసిక ఉల్లాసాన్నిస్తాయి

**– క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ**

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** క్రీడలు శారీరక మానసిక ఉల్లాసాన్ని స్తాయని వైఎస్సార్సిపి జిల్లా ఉపాధ్యక్షు డు ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రాల యం మండలం మాధవరం తాండ గ్రామంలో దీపావళి వేడుకలు పురస్క రించుకొని క్రికెట్ టోర్నమెంట్ ప్రారం భోత్సవానికి వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, మండల ఇంచార్జీ విశ్వనాథ్‌రెడ్డి, వైసీపీ నాయకులు కాంత్‌రెడ్డి, సూగూరు గోపిస్వా మిలు పాల్గొని క్రీడాపోటీలను ప్రారంభించారు. అనంతరం గోపిస్వామి ఆధ్వర్యంలో క్రీడాకా రులకు నూతన టీ షర్టులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైసీపీ నాయకులు వీరేష్ నాయక్, నాగేష్ నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న వైసీపి జిల్లా ఉపాధ్యక్షులు

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




సంతకాల సేకరణ చేపడుతున్న దృశ్యం

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు రఘురామ్ మూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తర్తూరు గ్రామంలో పర్యటించి భవన నిర్మాణ కార్మికులచే సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామ్ మూర్తి మాట్లాడుతూ ఏఐటియుసి, తదితర కార్మిక సంఘాలు పోరాటాల వలన భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు సాధించడం జరిగిందని అన్నారు. కార్మికులు ప్రమాదాల్లో గాయపడినా, మృతిం చెందినా నష్ట పరిహారాలు చెల్లింపులు, కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు, తదితర ప్రయోజనాలు బోర్డు ద్వారా అందేవని అన్నారు. గత వైసీపీ హాయంలో ఈ బోర్డు నిధులను పక్కదారి పట్టించడంతో 50 వేల కార్మికులకు పైగా రావాల్సిన క్లైమ్‌లు ఆగిపోయాయని అన్నారు. ఈ సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి బోర్డును పునరుద్ధరించి అదనపు సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని అన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని అన్నారు. సంతకాల సేకరణ పూర్తి చేసిన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లాలు బాషా, బాబు, మౌలాలి, వాహబ్, అన్వర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

# దాడిని ఖండిస్తూ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన

**బండిఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయిపై దాడిని ఖండిస్తూ నేడు నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఎమ్మార్పీ ఎస్, ఎంఎస్‌పి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వ హించడం జరుగుతుందని జిల్లా ప్రధాన కార్యదర్శి పూల వెంకటసు బ్బన్న ఆదివారం బండిఆత్మకూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జస్టిస్ గవాయి తండ్రి నుంచి తన వరకు రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తిని గుండె నిండా నింపుకున్నారనేది వారి గత చరిత్ర సాక్షిగానే నిలబడింది. అంతే కాకుండా ఈ నెల 17న ఆత్మకూరు, నంద్యాల, బండిఆత్మ కూరులో నిరసన ధర్నా చేపడతామని అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి నిరన చేపడతామని తెలిపారు.



# శెట్టివీడులో వీధి దీపాలు ఏర్పాటు

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** మండలం లోని శెట్టివీడు గ్రామంలో ఆదివారం వీధిదీపాలు ఏర్పాటు చేసిన ట్లుపంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 వ ఆర్థిక సంఘంనిధులు సుమారు రూ 34 వేలతో గ్రామం లోని పలు కాలనీలలో 28 ఎల్ఈడీ వీధి దీపాలు అమర్చినట్లు ఆయన తెలిపారు. వీధి దీపాల ఏర్పాటును స్థానిక టిడిపి నాయకులు నరసింహారెడ్డి పర్యవేక్షించారు. వీధిదీపాల ఏర్పాటుతో రాత్రి వేళ్ళలో ఇబ్బందులు తొలగడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జేఎల్ఎం వెంక టేష్,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

## గ్రామానికి బస్సు సౌకర్యం.. హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు



బస్సుకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** మండలంలోని శింగరాజుపల్లి గ్రామానికి ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యంను ఏర్పాటు చేయడంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామంలోకి వచ్చిన ఆర్టీసీ బస్సుకు మామిడి తోరణాలు, పూలమాలలు వేసి పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం హారతులు ఇచ్చి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత కొన్నేళ్ల నుంచి ఆర్టీసీ బస్సు లేకపోవడంతో కిలో మీటరు మేరా నడుచుకుంటూ వెళ్లి బస్టాండు వద్ద నుంచి ఆత్మకూరు వెళ్లేవారమని అన్నారు. బస్సు గ్రామంలోకి రావడంతో ఎంతో సంతోషంగా ఉందని ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ బస్సు ఉదయం ఆత్మకూరులో 8:30 గంటలకు బయలుదేరి 9:30 గంటలకు శింగరాజుపల్లెకు చేరుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆత్మకూరులో మధ్యాహ్నం 3:00 గంటలకు బయలుదేరి 4:00 గంటలకు శింగరాజుపల్లెకు చేరుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

## రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చిన గత వైసిపి ప్రభుత్వం

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చిందని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు అన్నారు. పత్తికొండలో 41 మందికి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మం జూరైన రూ. 35లక్షల చెక్కులను ఎమ్మెల్యే శ్యామ్‌కుమార్‌తో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడు తూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగిస్తుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.



చెక్కులు అందుకున్న లబ్దిదారులతో ఎంపి, ఎమ్మెల్యే

## బాధిత కుటుంబాన్ని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** మంత్రాలయం మండల పరిధిలోని సూగూరు గ్రామంలో ఎద్దులబండి బెదిరి ద్విచక్ర వాహనం తగలడంతో మృతి చెందిన బాలుడు బీరప్ప(5) తల్లిదండ్రులు వీర నాగప్ప వీరమ్మలను వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఇందులో వైసీపీ గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డలో ఘోర రోడ్డు ప్రమాదం

**-ఒకరు మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు**

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :**





కర్నూలు చిత్తూరు జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలకు వెళ్తే.. పిచ్చి రెడ్డి అనే వ్యక్తి తిరుపతి నుంచి హైదరాబాద్ కు కారులో వెళ్తుండగా ఆళ్లగడ్డ మండలం గుబగుండం మెట్ట సమీపంలో నిద్రమత్తులో చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నజీర్ హుస్సేన్ (31) అక్కడక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కమలాపురానికి చెందిన పిచ్చి రెడ్డి అనే వ్యక్తి తిరుపతిలో మారుతి షోరూం లో సేల్స్ మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. కొత్త కారును తిరుపతి నుంచి హైదరాబాద్కు డెలివరీ ఇచ్చేందుకు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో కడప వద్ద ఇద్దరు ప్రయాణికులను కారులో ఎక్కించుకున్నాడు. ఈ ప్రమాదంలో కడప వద్ద ఎక్కిన ప్యాసింజర్లలో నజీర్ హుస్సేన్ అక్కడక్కడే మృతి చెందా డు.. పిచ్చి రెడ్డితో పాటు మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిని హుటాహుటిన ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం నంద్యాల ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సూర్య

సోమవారం 13 అక్టోబరు 2025

## సత్రం,కళ్యాణ మండపం నిర్మాణానికై రూ.4 లక్షలు విరాళం

**-విరాళం అందజేసిన అధ్యక్షుడు శెట్టి విజయకుమార్**



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లోని శ్రీకృష్ణదేవరాయ కాపు, బలిజ, నిత్య అన్నదాన సత్రం అధ్యక్షుడు శెట్టి విజయ్ కుమార్ తన తల్లి రాజేశ్వరమ్మ జ్ఞాపకార్థంగా నాలుగు లక్షల కళ్యాణ మండపం నిర్మాణానికై విరాళంగా అందించారు. ఈ సందర్భంగా సత్రం కమిటీ సభ్యులకు 4 లక్షల చెక్ ను విరాళంగా అందించి విలేకరుల సమావేశంలో శెట్టి విజయకుమార్ మాట్లాడారు. తన తల్లి రాజేశ్వరమ్మ జ్ఞాపకార్థంగా ప్రతి ఏటా పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. సత్రం అభివృద్ధికి మున్ముందు కూడా తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ఇందులో భాగంగానే కళ్యాణ నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలను విరాళంగా అందించినట్లు తెలిపారు. ఇటీవల అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ చరిత్రపై ఓ చిత్రాన్ని తాను స్వయంగా నిర్మించినట్లు అన్నారు. త్వరలోనే ఆ చిత్రం విడుదల ఉంటుందన్నారు. స్వామి వారి మహిమలు జీవిత చరిత్ర సనాతన ధర్మం సాంప్రదాయాలను ఈ చిత్రంలో చిత్రీకరించినట్లు తెలిపారు.

## నేడు శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం





**శ్రీశైలం,మేజర్ న్యూస్:** ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం కార్యక్రమం రేపు జరగనుంది.ఛైర్మన్ గా ఎన్నికైన పోతుగుంట రమేశ్ నాయుడు తోపాటు మొత్తం 17 సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు పేర్కొన్నారు.చంద్రావతి కళ్యాణమండపం నందు ఉదయం 9.05 గంటలకు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.ఈ పాలక మండలి రెండేళ్లపాటు కొనసాగనుంది.ఈ మేరకు దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు.

## కురువ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తా



ఛైర్మన్ దేవేంద్రప్పను సత్కరిస్తున్న నాయకులు

**హొళగుంద,మేజర్‌న్యూస్‌:** హొళగుందలో భక్త కనకదాసు కురువ కమ్యూనిటి హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురువ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప అన్నారు. ఆదివారం ఆయన స్థలాన్ని పరిశీలించారు.ఆయనకు కురువ సంఘం మండల నాయకులు శాల్వలను కప్పి పూలమాలతో సత్కరించారు.ఈ సందర్భంగా ఆదోని,ఎల్లార్తి కూడలి రోడ్డుల్లో భక్త కనకదాసు విగ్రహాన్ని అవిష్కరించేందుకు స్థలాన్ని పరిశీలించారు.కమ్యూనిటి హాల్‌ను నిర్మాణానికి నిధులు మంజురు చేయిస్తానని నాయకులకు ఆయన హామి ఇచ్చారు.కార్యక్రమంలో పూజారి బీరప్ప,ఎల్లార్తి దర్గన్న,.గజ్జహళ్లి బోజ్జన్న,ముద్దటమాగి గర్జప్ప,చాగప్ప,వందవాగలి శేషప్ప, వెంకోబ,ఆంజనేయ పాల్గొన్నారు.

## ఉర్దూ కళాశాల అభివృద్ధికి సహకరించండి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న కమిటి సభ్యులు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** కడప జిల్లా వేంపల్లె ఉర్దూ కళాశాల అభివృద్ధికి సహకరించాల ని రాష్ట్ర న్యాయ, మైనార్టి సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండి ఫరూక్‌ను వేంపల్లె మసీదు కమిటి సభ్యులు కలిసి వినతిపత్రం అందించారు. ఆదివారం నంద్యాల టీడీపీ కార్యాలయంలో వేంపల్లె మసీదు కమిటి సభ్యులు ఇబ్రహీం మంత్రిని కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా కమిటి సభ్యులు మాట్లాడుతూ ఉర్దూ కళాశాల, మర్కస్ మసీదు అభివృద్ధికి నిధులు కేటాయించాలని అన్నారు. మంత్రి ఫరూక్ సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## శ్రీతిరుమల వెంకటేశ్వరస్వామి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్‌:** పత్తికొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కంగాటి శ్రీదేవమ్మ మాట్లాడుతూ సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతన్నల పొలాలు పచ్చదనంతో కళకళలాడాలని, వారి కుటుంబాలు సుఖశాంతులతో జీవించాలని మనస్ఫూర్తిగా భగవంతున్ని ప్రార్థించామన్నారు. అదేవిధంగా ప్రజలందరికీ ఆరోగ్యం, ఐశ్వర్యం, అభివృద్ధి కలగాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు.



## పల్లా శ్రీనివాసరావుకి స్వాగతం పలికిన తెదేపా నాయకులు

**:- ప్రధాని మోడీ పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై పల్లా శ్రీనివాసరావుతో చర్చించిన ఎంపి**



పల్లా శ్రీనివాసరావుతో ఎంపి, ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షులు, నాయకులు

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకి నగరంలోని స్టేట్ గెస్ట్‌హౌస్ నందు ఎంపి బస్తిపాటి నాగరాజు, తెదేపా జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డిలు ఆదివారం ఘన స్వాగతం పలికారు. ప్రధాని మోడీ పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై పల్లా శ్రీనివాసరావుతో ఎంపి నాగరాజు చర్చించారు. తెదేపా నాయకులు, నంద్యాల తెదేపా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, ఎమ్మెల్సీ బిటి నాయుడు, ఎమ్మెల్యేలు గౌరు చరితరెడ్డి, బి దస్తగిరి, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డిసిఎంఎస్ ఛైర్మన్ వై నాగేశ్వరరావు యాదవ్, ఆదోని నియోజకవర్గ ముఖ్య నాయకులు ఉమాపతి నాయుడు, కర్నూలు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, ఆర్టీసి కడప జోన్ ఛైర్మన్ పూల నాగరాజు, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వహీద్, ఉపాధ్యక్షులు పుల్లయ్య, కర్నూలు నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు సోమిశెట్టి నవీన్‌లు స్వాగతం పలికారు.

## శ్రీశైలంలో పటిష్టమైన భారీ బందోబస్తు

**-నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్**

**-బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ**



**శ్రీశైలం,మేజర్ న్యూస్:** ఈనెల 16న దేశ ప్రధాని శ్రీశైలం పర్యటన సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ తెలిపారు. ఆదివారం శ్రీశైలంలో బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ స్వయంగా పరిశీలించారు.ప్రధాని పర్యటించే ప్రదేశాలలో అనగా హెలిపాడ్,రోడ్డు మార్గం, భ్రమరాంబ గెస్ట్ హౌస్,గుడి పరిసర ప్రదేశాలు,సేఫ్ హౌస్ మొదలగు ప్రాంతాలను పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా తీసుకోవలసిన చర్యలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇప్పటికే శ్రీశైల పరిసర ప్రాంతాలలు, నల్లమల అడవి ప్రాంతాలలో గ్రేహౌండ్స్ సాయిధ బలగాలు ప్రధాని పర్యటనకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

## ప్రధాన మంత్రి మోదీ సభను విజయవంతం చేయాలి

**డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి**



పట్టణ, మండల కన్వీనర్లను సన్మానించిన ఎమ్మెల్యే, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

**ప్యాపిలి, మేజర్‌న్యూస్‌:** భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోధీ సభను విజయవంతం చేయాలని డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం ప్యాపిలి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిధి గృహంలో కూటమి నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ ఈనెల 16వ తేదిన మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉమ్మడి కర్నూలు జిల్లాకు వస్తున్న సందర్భంగా మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్యాపిలి మండల, పట్టణ కన్వీనర్లుగా ఎన్నికైన మెట్టుపల్లి సుదర్శన్, కొంగనపల్లి మధులను పూలమాలలతో ఎమ్మెల్యే సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో డిసిఎంఎస్ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, నియోజకవర్గ పరిశీలకులు కేసి.హరి, మండల కన్వీనర్ మెట్టుపల్లి సుదర్శన్, మండల ఇంచార్జ్ ఎద్దులదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు వై.లక్ష్మినారాయణయాదవ్, ఆర్‌ఆ.నాగరాజు, ముస్లిం మైనారిటీ నాయకులు ఖాజాపీరా, గడ్డం అంకిరెడ్డి, ఎర్రగుంట్లపల్లె బత్తుల రమేష్‌రెడ్డి, తొప్పెల శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షులు కొంగనపల్లి మధు, నడిగడ్డ నాగేంద్ర, అలేబాద్ పరమేష్, గుడిపాడు వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ మధు, చల్లా వీరాంజినేయులు, ఏనుగుమర్రి రామకృష్ణ, రమేష్‌గౌడ్, పుల్లాసి దస్తగిరి, కొమ్మెమర్రి వెంకటరాముడు, కడితం ప్రతాప్‌రెడ్డి, ఎస్‌కె.వలి, వార్డు మెంబర్ వెంకటేష్, బ్యాంకు శీను, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజల సంక్షేమాభివృద్ధే ఎమ్మెల్యే బుడ్డా ధ్యేయం

**- స్పోర్ట్స్‌క్లబ్ గౌరవ అధ్యక్షులు రేడియం నూర్, సింగిల్ విండో ఛైర్మన్ షాబుద్దీన్‌లు- కొత్తపేటలో ఉచిత మెడికల్ క్యాంపు**



మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న రేడియం నూర్, షాబుద్దీన్‌లు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** శ్రీశైలం నియోజకవర్గ ప్రజల సంక్షేమాభివృద్ధితో పాటు ఆయురారోగ్యాలతో ఉండేలా చూడాలన్నదే శ్రీశైలం నియోజకవర్గం శాసన సభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి ధ్యేయమని ఆత్మకూరు స్పోర్ట్స్‌క్లబ్ గౌరవ అధ్యక్షులు రేడియం నూర్, సింగిల్ విండో ఛైర్మన్ షాబుద్దీన్‌లు అన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్తపేట నవభారత పాఠశాల ఆవరణంలో ఆత్మకూరు స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షులు పస్పిల్ మున్నా ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు చక్ర హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా రేడియం నూర్, షాబుద్దీన్‌లు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గ ప్రజల సంక్షేమాభివృద్ధితో పాటు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఉచితంగా మెడికల్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్యాంప్‌లో ఇసిజి, 2డిఏకో పరీక్షలు, కంటికి సంబంధించిన పరీక్షలు, ఎముకల వ్యాధులకు సంబంధించన సమస్యలకు పరీక్షలు నిర్వహించారన్నారు. ఈక్యాంపులో దాదాపు 300మంది పరీక్షలు చేయించుకోవడం జరిగిందన్నారు. ఉచితంగా నిర్వహించే మెడికల్ క్యాంపులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోని ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగూర్ ఖాన్, ఖాజామొద్దీన్, ఆసిప్ బేగ్, నాయబ్ సయ్యద్, అసదుల్లా, సాదిక్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల ఛలో విజయవాడ

**డోన్, మేజర్‌న్యూస్‌:**

విద్యుత్ జేఏసి తలపెట్టిన ఛలో విజయవాడ ధర్నా కార్యక్రమానికి డోన్ డివిజన్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగులు, విద్యుత్ కార్మికులు ఆదివారం పెద్దఎత్తున విజయవాడ నగరానికి తరలివెళ్ళారు. ధర్నాకు తరలివెళ్ళిన వారిలో డోన్ డివిజన్ జేఏసి నాయకులైన రామకృష్ణ, సుబ్రహ్మణ్యం,గోపికృష్ణ, వెంకటేశ్వర్లు,విద్యుత్ కార్మికులు ఉన్నారు.




విజయవాడకు తరలివెళ్తున్న విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు

# బీసీలను అవమానిస్తే తాట తీస్తాం..

**డిసిఎంఎస్ ఛైర్మెన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరరావుయాదవ్**


సమావేశంలో మాట్లాడుతున్న వై.నాగేశ్వరరావుయాదవ్

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ః** పెర్ని నానికి ప్రజలు అధికార మదం తగ్గించినప్పటికీ అహంభవం తగ్గినట్లు లేదని, అడ్డగోలుగా రోడ్డెక్కి రాద్ధాంతం చేయడమే కాకుండా చట్టాన్ని పరిరక్షించే పోలీసులపై దాడి చేయడం వారిని అవమానించడం సిగ్గుచేటని, ఒక బీసీ బిడ్డ ఆర్‌పేట పోలీసుస్టేషన్ ఎస్సైని అవమానించేలా మాట్లాడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామనీ, బీసిలను అవమానిస్తే తాటతీస్తామని డిసిఎంఎస్ ఛైర్మన్, జాతీయ బీసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. ఆదివారం ప్యాపిలి పట్టణంలోని డిసిఎంఎస్ కార్యాలయంలో వై.నాగేశ్వరరావుయాదవ్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేర్ని నాని లాంటి వీధి రౌడీలకు రాజకీయాల్లో ఉండే అర్హత ఏమాత్రం లేదని, పేర్నినాని బీసిలు అంటే ఎందుకంత చిన్నచూపు, ఒక బీసి చేతిలో 50వేల ఓట్ల పైచిలుకు తేడాతో ఓడిపోవడం పార్టీలో, ప్రభుత్వంలో బీసిలకు పెద్దపీట వేయడాన్ని జీర్ణించుకోలేక నీచ రాజకీయాలకు తెబడ్డారన్నారు. మరోసారి బీసిలను చిన్నచూపు చూస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో డోన్ నియోజకవర్గం పరిశీలకులు కేసి.హరి, మాజీ ఎంపిటిసి రామ్మోహన్‌యాదవ్, బోయిన్‌చెరువుపల్లి కిష్టయ్య, ఏనుగుమర్రి రాము, జక్కసానికుంట్ల మహేష్‌యాదవ్, కోదండరామయ్యయాదవ్, బోయవాండ్లపల్లె కంబగిరి పాల్గొన్నారు.

## కోటి సంతకాల కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం – మాజీ ఎమ్మెల్యే శిల్పా

**– వైసిపి కార్యాలయంలో కోటి సంతకాల కార్యక్రమం ప్రారంభం**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ చేపడుతున్న వ్యతిరేక విధానాలను, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తు కోటి సంతకాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీశైలం మాజి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్‌సిపి కార్యాలయంలో వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎపిలో ప్రభుత్వ మెడికల్ కాలేజిల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తు చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమాన్ని మాజి ఎమ్మెల్యే శిల్పా మొదటి సంతకం చేసి ప్రారంభించారు. ఈ సంద


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

ర్భంగా మాజి ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేఖ వి ధానాలను నిరసిస్తు చేపట్టిన ప్రజా ఉద్యమం కోటి సంతకాల కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కోటి సంతకాలు సేకరించడం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు నెరవేర్చలేని హామిలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు ప్రభుత్వం పూనుకోవడం సరైంది కాదని అన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తు కోటీ సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని , ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## డోన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మండల, పట్టణ కన్వీనర్ల నియామకం


దశరథరామిరెడ్డి


ఎల్లనాగయ్య


మెట్టుపల్లి సుదర్శన్


టిఈ.రాఘవేంద్రగౌడ్


బుగ్గన ప్రసన్నలక్ష్మి


కొంగనపల్లి మధు

**డోన్, మేజర్‌న్యూస్ః** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డిల సూచనల మేరకు డోన్ శాసనసభా నియోజకవర్గాలలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాలు, పట్టణాలకు పార్టీ కన్వీనర్లను నియమించడమైనది. ఈ ఆదేశాల ప్రకారం వారు వారి పరిధిలో పార్టీ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. డోన్ మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్‌గా దశరథరామిరెడ్డి, బేతంచెర్ల మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్‌గా ఎల్లనాగయ్య, ప్యాపిలి మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్‌గా మెట్టుపల్లి సుదర్శన్, డోన్ తెలుగుదేశం పార్టీ పట్టణ కన్వీనర్‌గా టిఈ.రాఘవేంద్రగౌడ్, బేతంచెర్ల తెలుగుదేశం పార్టీ పట్టణ కన్వీనర్‌గా బుగ్గన ప్రసన్నలక్ష్మి, ప్యాపిలి తెలుగుదేశం పార్టీ పట్టణ తెలుగుదేశం పార్టీ కన్వీనర్‌గా కొంగనపల్లి మధులు ఎన్నికైయ్యారు. వీరికి ఆయా మండలాలు, పట్టణాల్లోని పార్టీ కార్యకర్తలు, నాయకులు సహకరించి తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయవలసిందిగా అధిష్టానం పిలుపునిచ్చింది.

# కెడీసీసీ ఛైర్మెన్‌గా రాజశేఖర్ గౌడ్..?

**పార్టీ విధేయుడికి పట్టం..**
**త్వరలోనే ప్రమాణ స్వీకారం..**

**దేవనకొండ మేజర్ న్యూస్ :** టిడిపి ఆవిర్భావం నుండి నేటి వరకు పార్టీ విధేయులుగా ఉంటూ పార్టీకి సేవలందించిన పల్లెదొడ్డి గ్రామానికి చెందిన కిష్టన్న గౌడ్ కుమారుడు రాజశేఖర్ గౌడ్‌ను పార్టీ పెద్దలు దేవనకొండ మండల కెడిసిసి ఛైర్మన్‌గా ఖరారు చేసినట్లు తెలుస్తోంది.నాడు పాలెగారి వెంకటప్ప నాయుడు వర్గంలోనూ ప్రధాన నాయకులుగా ఉంటూ రాజకీయాలు చేసిన కిష్టన్న గౌడ్ నాయుడు ఆశిస్సులతో పల్లెదొడ్డి గ్రామ సర్పంచ్‌గా ఎన్నుకోబడ్డాడు.నాయుడు మరణాంతరం ఆయన కుమారుడు రాజశేఖర్ గౌడ్ నాయుడు వారసుడుగా ఉన్నటువంటి పరమప్పనాయుడుకు కుడి భుజంగా


ముఖ్యమంత్రి చంద్రబాబుతో రాజశేఖర్ గౌడ్(ఫైల్‌ఫోటో)

ఉన్నాడు.ఇందులో భాగంగానే నాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కెడిసిసి ఛైర్మన్ అభ్యర్థిగా టిడిపి తరపున పరమప్పనాయుడు పోటీలో ఉండగా ఆయన వెంట నడిచిన రాజశేఖర్ గౌడ్‌ను పరమప్ప నాయుడు ప్రత్యర్థులు అంత మొందించాలని ప్రయత్నించారు.ప్రాణాలను అరచేతిలో పెట్టుకున్న రాజశేఖర్ గౌడ్ స్థానిక పోలీసు స్టేషన్లోకి పరిగెత్తుకుంటూ వెళ్లి నాడు ప్రాణాలను కాపాడుకున్నాడు. పరమప్పనాయుడు మరణాంతరం కూడ నేడు పార్టీలో ఉంటూ చురుగ్గా ముందుకెళ్తున్న ఆయన టిడిపి మండల నాయకులతో కలిసి కెడిసిసి ఛైర్మన్‌గా అవకాశం ఇవ్వాలని పార్టీ ఇన్చార్జీ వైకుంఠం దంపతులను కలవడం జరిగింది. ఇందులో భాగంగా వైకుంఠం దంపతులు కూడ రాజశేఖర్ గౌడ్ పేరును ఏకగ్రీవంగా పార్టీ పెద్దలకు ప్రతిపాధించడంతో దేవనకొండ కెడిసిసి ఛైర్మన్‌గా రాజశేఖర్ గౌడ్ త్వరలోనే ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని సమాచారం.అయితే నాటి నుండి నేటి వరకు మండలంలోని రెండు కుటుంబాల మధ్య జరిగిన పదవుల ఆధిపత్యపోరులో వర్గాలకు సంబందం లేకుండా మొదటి సారి పార్టీ విధేయుడికి పదవి లభించడం గమనార్హం.

## జాతీయ స్థాయి యోగా పోటీలలో ధన ధీరజ్‌కు మూడో స్థానం


ప్రశంసపత్రం, మెడల్ అందుకున్న ధన ధీరజ్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** మైసూర్‌లోని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో ఈ నెల 9, 12వ తేదీల్లో జరిగిన 50వ జాతీయ స్థాయి సీనియర్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ నందు కర్నూలు జిల్లాకు చెందిన క్రీడాకారులు ఫ్రీస్టైల్ డాన్స్ భాగంలో పాల్గొని మూడో స్థానం సాధించినట్లు రాష్ట్ర కార్యదర్శి అవినాష్ శెట్టి తెలిపారు. ఈ సందర్భంగా ఏషియన్ యోగా ఫెడరేషన్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్ అగర్వాల్, యోగ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి డాక్టర్ అభినవ్ జోషి చేతుల మీదుగా ప్రశంసపత్రాలతో పాటు మెడల్స్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా యోగ సంఘం ఛైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముంతాజ్ బేగం, ప్రధాన కార్యదర్శి మునిస్వామితో పాటు ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, సాయికృష్ణ, కోశాధికారి విజయ్ కుమార్‌లు అభినందనలు తెలిపారు.

## ప్రధాని పర్యటనలో సమర్ధవంతంగా పనిచేయాలి

**ః– అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకోండి ః– కమీషనర్ పి విశ్వనాథ్ ఆదేశం**

**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :** ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈ నెల 16న కర్నూలు పర్యటన సందర్భంగా నగరపాలక అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కమీషనర్ పి విశ్వనాథ్ ఆదేశించారు. ఆదివారం కమీషనర్ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా రహదారుల మరమత్తు పనులు, పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు, సైన్ బోర్డులు, దీపాల ఏర్పాటు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య చర్యలు, మొబైల్ టాయిలెట్లు, స్నాక్స్, హెల్ప్ డెస్క్ ఏర్పాట్లపై పూర్తిస్థాయి దృష్టి సారించాలని కమీషనర్ సూచించారు. అలాగే నగరంలో సుందరీకరణ, పారిశుద్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. కమీషనర్లు, పారిశుద్ధ్య సిబ్బంది ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా వసతి, ఆహారం, రవాణా వంటి అవసరమైన సౌకర్యాలు సమకూర్చాలని సూచించారు. సమావేశంలో అదనపు కమీషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమీషనర్ సతీష్ కుమార్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇంచార్జ్ ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమీషనర్ విశ్వనాథ్

## బెల్ట్ గ్రేడింగ్‌లో రామ్స్ స్కూల్ ఆఫ్ కరాటే విద్యార్థులు


బెల్ట్ గ్రేడింగ్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు

**డోన్, మేజర్‌న్యూస్ః** పట్టణంలోని స్థానిక శ్రీసుధ సిబిఎస్ఈ ప్రాంగణంలో ఆదివారం ఉమ్మడి కర్నూలు జిల్లా స్పోర్ట్స్ కరాటే డు అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్‌లో రామ్స్ స్కూల్ ఆఫ్ కరాటే విద్యార్థులు పాల్గొని బెల్ట్, ప్రశంశపత్రాలను ముఖ్య అతిధులు హైకోర్ట్ అడ్వకేట్ ప్రశాంతి, శ్రీసుధా సిబిఎస్ఈ ప్రిన్సిపాల్ ధోనిల చేతుల మీదుగా అందుకున్నారు. బెల్ట్‌లు సాధించిన విద్యార్థులు ఎల్లో బెల్ట్ ఇషాన్విత, తన్విక, రితిక్, దియాన్స్, సాజిదా, వర్ణిక, ఆరంజ్ బెల్ట్ః– మహాలక్ష్మి, హేమంత్, షరీఫ్, విశ్వ, గ్రీన్ బెల్ట్ః– చక్రధర్, సూర్యతేజ, దక్షయనీ, పర్పల్ బెల్ట్ః– మనోజ్ఞ, అశ్వార్థరెడ్డి, బ్లూ బెల్ట్ః– భాను ప్రకాశ్, బ్రౌన్ బెల్ట్ః– అభినయభాయ్, బ్లాక్ బెల్ట్ః– సాత్విరెడ్డి, తన్విరెడ్డిలు సాధించారని కరాటే మాస్టర్ రమణ తెలిపారు. అనంతరం విద్యార్థులను పాఠశాల గౌరవ అధ్యక్షులు సుదర్శన్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..మంత్రి బిసి

**ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి**

**బనగానపల్లె,మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు , భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సూచించారు. ఆదివారం సాయంత్రం బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం అభివృద్ధితో కూడిన సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అన్నారు. బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్ లో మాట్లాడి పరిష్కరించడం జరిగింది. ఎక్కువగా రెవెన్యూ సమస్యలు, ఫించన్లు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటి సమస్యలు ఆయన దృష్టికి రాగా ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించడం జరిగింది. ఈ అర్జీలు స్వీకరణ కార్యక్రమంలో ఆయా సమస్యలపై మంత్రి స్పందించిన తీరుతో బాధితుల నుంచి ఆనందం వ్యక్తం అవుతుంది. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు.



సూర్య
సోమవారం| 13 అక్టోబరు 2025




# పౌరసత్వం

**పౌరసత్వం :**

❍ పౌరసత్వం అనే పదం ఆంగ్లభాషలోని Citizenship అనే పదానికి అనువాదం .

❍ 'Citizenship" అనే పదం లాటిన్ భాషలోని "సివిస్" మరియు "సివిటాస్" అనే పదాల నుండి ఆవిర్భవించింది. సివిస్ అనగా పౌరులు, సివిటాస్ అనగా నగరం అని అర్థం

❍ భారత రాజ్యాంగంలోని రెండవ భాగంలో 5 నుండి 11 వరకు గల ప్రకరణలు దీనిని గురించి వివరిస్తాయి. మన భారత దేశములో ఏకపౌరసత్వ విధానం అమలులో ఉంది. ఈ విధానాన్ని మనం బ్రిటన్ నుండి గ్రహించాము.

❍ పౌరసత్వం అనే అంశం కేంద్ర జాబితాలో ఉంది.

❍ వాస్తవానికి, పౌరసత్వ చట్టం (1955) కూడా కామన్వెల్త్ పౌరసత్వాన్ని అందించింది. కానీ, ఈ నిబంధనను పౌరసత్వ (సవరణ) చట్టం, 2003 రద్దు చేసింది.

❍1955 నాటి పౌరసత్వ చట్టం పౌరసత్వం పొందటానికి ఐదు మార్గాలను నిర్దేశిస్తుంది, అవి జననం, సంతతి, నమోదు, సహజత్వం మరియు భూభాగాన్ని చేర్చడం.

**పౌరసత్వాన్ని పొందే పద్ధతులు :**

**1. పుట్టుకతో పౌరసత్వం :**

❍ జనవరి 26,1950న లేదా తరువాత, కానీ జూలై 1,1987 కి ముందు భారతదేశంలో జన్మించిన వ్యక్తి తన తల్లిదండ్రుల జాతీయతతో సంబంధం లేకుండా పుట్టుకతో భారత పౌరుడిగా ఉంటాడు.

❍ జూలై 1,1987 న లేదా తరువాత భారతదేశంలో జన్మించిన వ్యక్తి తన తల్లిదండ్రులలో ఒకరు పుట్టిన సమయంలో భారత పౌరులైతే మాత్రమే భారత పౌరుడిగా పరిగణించబడతారు.

❍ ఇంకా, డిసెంబర్ 3,2004 న లేదా తరువాత భారతదేశంలో జన్మించిన వారి తల్లిదండ్రులు ఇద్దరూ భారత పౌరులు లేదా వారి తల్లిదండ్రులలో ఒకరు భారత పౌరుడు మరియు మరొకరు వారి పుట్టిన సమయంలో అక్రమ వలసదారు కాకపోతే మాత్రమే భారత పౌరులుగా పరిగణించబడతారు.

**2. వారసత్వంతో పౌరసత్వం :**

❍ జనవరి 26,1950 న లేదా తరువాత భారతదేశం వెలుపల జన్మించిన వ్యక్తి, కానీ డిసెంబర్ 10,1992 కి ముందు, అతని తండ్రి పుట్టిన సమయంలో భారత పౌరుడు అయితే, సంతతికి చెందిన భారత పౌరుడు.

❍ 1992 డిసెంబర్ 10న లేదా ఆ తరువాత భారత దేశం వెలుపల జన్మించిన వ్యక్తి, అతని తల్లిదండ్రులలో ఎవరైనా అతను పుట్టిన సమయంలో భారత పౌరులైతే, భారత పౌరుడిగా పరిగణించబడతారు.

**3. నమోదు ద్వారా పౌరసత్వం :**

❍ కేంద్ర ప్రభుత్వం, ఒక దరఖాస్తుపై, ఈ క్రింది వర్గాలలో దేనికైనా చెందిన వ్యక్తిని (అక్రమ వలసదారుడు కాని వ్యక్తి) భారత పౌరుడిగా నమోదు చేసుకోవచ్చు,

❍అవిః (1) రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేయడానికి ముందు 7 సంవత్సరాలు భారతదేశంలో సాధారణంగా నివసించే భారతీయ సంతతికి చెందిన వ్యక్తి (2) అవిభక్త భారతదేశం వెలుపల ఏ దేశంలోనైనా లేదా ప్రదేశంలో సాధారణంగా నివసించే భారతీయ సంతతికి చెందిన వ్యక్తి(3) భారత పౌరుడిని వివాహం చేసుకుని, రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేయడానికి ముందు ఏడు సంవత్సరాలు భారతదేశంలో సాధారణంగా నివసించిన వ్యక్తి (4) భారత పౌరులుగా ఉన్న వ్యక్తుల మైనర్ పిల్లలు (5) పూర్తి వయస్సు మరియు సామర్థ్యం ఉన్న వ్యక్తి, అతని తల్లిదండ్రులు భారత పౌరులుగా నమోదు చేయబడ్డారు(6) పూర్తి వయస్సు మరియు సామర్థ్యం ఉన్న వ్యక్తి, లేదా అతని తల్లిదండ్రులలో ఒకరు, ఇంతకు ముందు స్వతంత్ర భారత పౌరుడు, మరియు సాధారణంగా భారతదేశంలో నివసించే వ్యక్తి, రిజిస్ట్రేషన్ కోసం వెంటనే పన్నెండు నెలల సామర్థ్యం గల వ్యక్తి .

**4. సహజీకృత పౌరసత్వం :**

❍ భారత ప్రభుత్వం రూపొందించిన చట్టాలకు లోబడి నిర్ణీత అర్హతలు కలిగి దరఖాస్తు చేసుకున్న విదేశీయులకు భారత పౌరసత్వం కల్పించబడుతుంది .అయితే ఈ క్రింది అర్హతలు కలిగి ఉండాలి .

(1)దరఖాస్తు సమర్పించే తేదీకి ముందు 12నెలల నుండి భారత దేశములో నివసించి ఉండాలి, లేదా భారత ప్రభుత్వ సేవలలో ఉండాలి, ఈ రెండు కలిపి కూడా ఉండవచ్చు .

(2) పైన పేర్కొన్న 12 నెలల ముందు కాలంలో గడిచిన 14 సంవత్సరాలలో కనీసం 11 సంవత్సరాల పాటు భారత దేశములో నివసించి ఉండాలి లేదా భారత ప్రభుత్వ సేవలలో ఉండాలి.

(3) రాజ్యాంగం లోని 8 వ షెడ్యూల్ లోని ఏదైనా ఒక భాషలో ప్రావీణ్యం కలిగి ఉండాలి .

(4) మంచి ప్రవర్తన కలిగి ఉండాలి

**5. భారత దేశం చేసుకున్న భూభాగాల ద్వారా పౌరసత్వం**

❍1950 జనవరి 26 తర్వాత ఏదైనా కొత్త భూభాగం భారత దేశములో విలినమైనపుడు ఆ భూభాగంలోని ప్రజలకు భారత పౌరసత్వం లభిస్తుంది . ఉదాహరణ పాండిచ్చేరి, గోవా భారత్ లో చేరడం.

**పౌరసత్వం కోల్పోవడం**

❍ పౌరసత్వ చట్టం (1955) చట్టం కింద లేదా రాజ్యాంగం ప్రకారం అంతకుముందు పొందిన పౌరసత్వాన్ని కోల్పోవడానికి మూడు మార్గాలను నిర్దేశిస్తుంది, అవి త్యాగం, రద్దు మరియు లేమి.

**1. త్యాగం ద్వారా**

❍ పూర్తి వయస్సు, సామర్థ్యం కలిగిన భారత పౌరుడు ఎవరైనా తన భారత పౌరసత్వాన్ని త్యజిస్తున్నట్లు ప్రకటించవచ్చు. ఆ ప్రకటనను నమోదు చేసిన తర్వాత, ఆ వ్యక్తి భారత పౌరుడిగా ఉండటం ఆగిపోతుంది. అయితే, భారతదేశం నిమగ్నమైన యుద్ధ సమయంలో అటువంటి ప్రకటన చేస్తే, దాని నమోదును కేంద్ర ప్రభుత్వం నిలిపివేస్తుంది.

❍ ఒక వ్యక్తి తన భారతీయ పౌరసత్వాన్ని త్యజించినప్పుడు, ఆ వ్యక్తి యొక్క మైనర్ బిడ్డ కూడా భారత పౌరసత్వాన్ని కోల్పోతాడు. అయితే, అటువంటి పిల్లవాడు పద్దెనిమిది సంవత్సరాల వయస్సు వచ్చినప్పుడు, భారత పౌరసత్వాన్ని తిరిగి పొందవచ్చు.

**2. ముగింపు లేదా తొలగింపుట ద్వారా..**

❍ ఒక భారతీయ పౌరుడు స్వచ్ఛందంగా (ఉద్దేశపూర్వకంగా, తెలిసి, ఒత్తిడి, అనవసరమైన ప్రభావం లేదా బలవంతం లేకుండా) మరొక దేశం యొక్క పౌరసత్వాన్ని పొందినప్పుడు, అతని భారతీయ పౌరసత్వం స్వయంచాలకంగా రద్దు చేయబడుతుంది. అయితే, భారతదేశం నిమగ్నమైన యుద్ధ సమయంలో ఈ నిబంధన వర్తించదు.

**3.బలవంతంగా రద్దు చేయడం :**

❍ కేంద్ర ప్రభుత్వం భారత పౌరసత్వాన్ని తప్పనిసరిగా రద్దు చేస్తుంది, ఒకవేళ (1) పౌరుడు మోసం ద్వారా పౌరసత్వం పొందటం (2) పౌరుడు భారత రాజ్యాంగానికి విధేయత చూపకపోవటం, (3) పౌరుడు యుద్ధ సమయంలో శత్రువుతో చట్టవిరుద్ధంగా వ్యాపారంయటం, లేదా కమ్యూనికేట్ చేయటం (4) పౌరుడు, నమోదు లేదా పౌరసత్వం పొందిన ఐదు సంవత్సరాలలోపు, ఏ దేశంలోనైనా రెండు సంవత్సరాలు ఖైదు చేయబడటం మరియు (5) పౌరుడు సాధారణంగా ఏడు సంవత్సరాలు నిరంతరం భారతదేశం వెలుపల నివసించటం.




**ఏక పౌరత్వం లక్షణం - భారత దేశం :**

❍ భారత రాజ్యాంగం సమాఖ్య అయినప్పటికీ, ద్వంద్వ రాజకీయ వ్యవస్థను (కేంద్రం మరియు రాష్ట్రాలు) కలిగినప్పటికీ, ఇది ఒకే పౌరసత్వాన్ని, అంటే భారత పౌరసత్వాన్ని మాత్రమే అందిస్తుంది.

❍ భారతదేశంలోని పౌరులు యూనియన్‌కు మాత్రమే విధేయత చూపాలి. ప్రత్యేక రాష్ట్ర పౌరసత్వం లేదు. మరోవైపు, యూఎస్ఏ, స్విట్జర్లాండ్ వంటి ఇతర సమాఖ్య రాష్ట్రాలు ద్వంద్వ పౌరసత్వ వ్యవస్థను స్వీకరించాయి.

❍ యూఎస్ఏలో, ప్రతి వ్యక్తి యూఎస్ఏ పౌరుడే కాదు, అతను ఏ రాష్ట్రానికి చెందినవాడో ఆ రాష్ట్రానికి చెందిన పౌరుడు కూడా. అందువల్ల, అతను రెండింటికీ విధేయత చూపుతాడు మరియు ద్వంద్వ హక్కులను పొందుతాడు-ఒకటి జాతీయ ప్రభుత్వం మరియు మరొకటి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రదానం చేయబడుతుంది.

**పౌరసత్వం గురించి వివరించే నిబంధనలు :**

❍ **ఆర్టికల్ 5:** రాజ్యాంగం ప్రారంభ సమయానికి భారత పౌరుడు ఎవరు, 26 జనవరి 1950 నాటికి భారత దేశంలో నివాసం (డొమిసైల్) కలిగి ఉండి,

1. భారతదేశంలో పుట్టినవారు లేదా
2. తల్లిదండ్రులలో ఒకరు భారతదేశంలో పుట్టినవారు లేదా 3. 26 జనవరి 1950కి ముందు కనీసం 5 సంవత్సరాలు భారతదేశంలో నివసించినవారు - పౌరులుగా పరిగణించబడతారు.

❍ **ఆర్టికల్ 6:** పాకిస్తాన్ నుండి భారతదేశానికి వలస వచ్చినవారి పౌరసత్వం.

⌘ 19 జూలై 1948కి ముందు వచ్చినవారు - పుట్టుక ఆధారంగా - నిరంతర నివాసం ఉండే పౌరులు.

⌘ 19 జూలై 1948 తర్వాత వచ్చినవారు - ప్రభుత్వ అధికారుల వద్ద నమోదు చేయించాలి.

⌘ ఉదాహరణ : డా. మన్మోహన్ సింగ్ ,L.K. అద్వానీ

**ఆర్టికల్ 7:** పాకిస్తాన్‌కు వలస వెళ్లినవారు భారత పౌరులు కారు.

❍ 1947 మార్చి 1 తర్వాత భారత దేశము నుండి పాకిస్తాన్ కి వలస వెళ్ళిన వారు భారతీయులుగా పరిగణించబడరు, కాని తిరిగి రిజిస్ట్రేషన్ ద్వారా భారత భూభాగం లోకి ప్రవేశిస్తే వారికి పౌరసత్వం లభిస్తుంది. కానీ తిరిగి శాశ్వత నివాసం కోసం అనుమతి తీసుకొని వచ్చి, నమోదు చేసుకుంటే - పౌరసత్వం తిరిగి పొందవచ్చు.

**ఆర్టికల్ 8:** విదేశాల్లో నివసిస్తున్న భారతీయ మూలం కలిగిన వారు, తల్లిదండ్రులు లేదా ముత్తాతలు భారత దేశంలో పుట్టి ఉంటే, భారత రాయబార కార్యాలయంలో నమోదు చేసుకొని పౌరులవుతారు.

**ఆర్టికల్ 9:** స్వచ్ఛందంగా విదేశీ పౌరసత్వం పొందిన వారు - భారత పౌరులు కారు.

**ఆర్టికల్ 10:** ఈ ఆర్టికల్స్ ప్రకారం పౌరులు పార్లమెంట్ చట్టం ప్రకారం పౌరసత్వాన్ని కొనసాగిస్తారు.

**ఆర్టికల్ 11:** పౌరసత్వం పొందడం లేదా కోల్పోవడం గురించి చట్టం చేయడానికి పార్లమెంట్‌కు అధికారం ఉంటుంది. ఇదే ఆధారంగా 1955 పౌరసత్వ చట్టం ఏర్పడింది.



సత్య ఇగ్గదిండ్ల
SATYA SIR APP
9177323403

**రచనలకు ఆహ్వానం**

పోటీ పరీక్షలకు అత్యుత్తమ మెటీరియల్, గైడెన్స్ అందిస్తూ 'ప్రజ్ఞ' విద్యార్థుల మన్ననలందుకుంది. 'ప్రజ్ఞ'ను మరింత ఉపయోగకరంగా తీర్చి దిద్దేందుకు అధ్యాపకులు, ఔత్సాహికుల నుంచి రచనలను (మెటీరియల్) ఆహ్వానిస్తున్నాం. ఏపీపీఎస్సీ , టీజీపీఎస్సీ, ఆర్ఆర్బీ, ఎస్ఎస్సి, బ్యాంక్, డీఎస్సీ తదితర పోటీ పరీక్షల మెటీరియల్‌ను సులభరీతిలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా రాయగల అధ్యాపకులు మెటీరియల్‌ను 'ప్రజ్ఞ' ఇమెయిల్ (suryaapragna71@gmail.com)కు లేదా 7288890072 వాట్సప్ నెంబరుకు పంపవచ్చు. రచనతో పాటు ఫోటో, ఫోన్ నెంబర్, అడ్రస్ తదితర వివరాలను జత చేయాలి.

# ప్రధాని ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి టీజీ భరత్, కలెక్టర్ సిరి



ఏర్పాట్ల తీరును అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ప్రధానమంత్రి కర్నూలు జిల్లాలో ఈ నెల 16వ తేదీన పర్యటించనున్న సందర్భంగా ఏర్పాట్లను కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ సిరి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, సిఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఎంఎల్‌సిలు బిటి నాయుడు, భూమి రెడ్డి రాంగోపాల్ రెడ్డి, కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టిడిపి జిల్లా ఇంచార్జ్ తిక్కారెడ్డి, మాజీ మంత్రి కెఈ ప్రభాకర్‌లు ఆదివారం పరిశీలించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా నన్నూరు టోల్‌గేట్ దగ్గరున్న రాగమయూరి వద్ద సభాప్రాంగణం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈ నెల 16న శ్రీశైలం దర్శనం పూర్తి చేసుకున్న అనంతరం కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేసిన సభకు రానున్నారన్నారు. సభకు హాజరవడంతో పాటు వర్చువల్ విధానం ద్వారా వివిధ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు. ఇప్పటికే ఏర్పాట్లు అని కూడా దాదాపుగా పూర్తి అయ్యాయని అన్నారు. ప్రధానమంత్రి పర్యటనను విజయవంతంగా చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. వారి వెంట ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మున్సిపల్ కమీషనర్ విశ్వనాథ్, డిసిఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, నందికోట నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ వెంకట్ రెడ్డి, టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి కావాలి

**:– జిల్లా కలెక్టర్ డా.ఏ సిరి**



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ డా.ఏ సిరి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లాలో ఈ నెల 16వ తేదీన ప్రధాన మంత్రి పర్యటించనున్న సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ఏర్పాట్లను నేటి లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ సిరి అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా నన్నూరు టోల్‌గేట్ దగ్గరున్న రాగమయూరి వద్ద సభాప్రాంగణం, హెలిప్యాడ్ ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సభా ప్రాంగణం, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలిస్తూ పిఎం వచ్చే దారిలో బారికేడింగ్ పనులను నేడు పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. అలాగే పార్కింగ్ ప్రదేశంలో పెండింగ్‌లో ఉన్న పనులను ఇతర రోడ్డు నిర్మాణ పనులను కూడా పూర్తి చేయాలన్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సభా ప్రాంగణం, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలిస్తూ సెక్యూరిటీ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పోలీస్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి భరత్ గుప్తా, శౌర్యమాన్ పటేల్, అన్నమయ్య జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం

- ప్రధాని పర్యటన నేపథ్యంలో కూటమి నాయకులతో మంత్రి బీసీ సన్నాహక సమావేశం
- పాల్గొన్న టీడీపీ పార్టీ బూత్, యూనిట్, క్లస్టర్ స్థాయి ఇన్చార్జిలు,బిజెపి, జనసేన నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి



**బనగానపల్లె,మేజర్ న్యూస్ :** దేశ ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన నేపథ్యంలోఆదివారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి. జనార్ధన్‌రెడ్డి బనగానపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో టీడీపీ పార్టీ బూత్, యూనిట్, క్లస్టర్ స్థాయి ఇన్చార్జీలు,బిజెపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూసమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేందుకు కేంద్రంలోని కూటమి ప్రభుత్వం జీఎస్టీని తగ్గించిందన్నారు. జీఎస్టీ తగ్గింపు ద్వారా దాదాపు రూ.2 లక్షల కోట్ల భారం ప్రజలపై తగ్గనుందని, అన్ని వస్తువులు రెట్లు తగ్గడంతో.. అన్ని వర్గాల ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు.సమాజంలో ప్రజల కొనుగోలు శక్తి పెరగడం అంటే ఆ కుటుంబాలు సంతోషంగా ఉన్నట్లే కదా అని అన్నారు. జీఎస్టీ సంస్కరణలను కేంద్రం తీసుకొచ్చినప్పుడు దేశంలో మొదట సమర్థించిన వ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు. జీఎస్టీ సంస్కరణల నిర్ణయం ఎన్డీఏ కూటమికి మద్దతుగా నిలుస్తూ భరోసా ఇచ్చిన వ్యక్తి సీఎం చంద్రబాబు అని, అదే క్రమంలో జీఎస్టీ మీటింగ్‌కు కర్నూలుకు రావాలని ప్రధానిని కోరడం.. ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంకు ఆహ్వానించడం జరిగిందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచే ప్రధాని తన ప్రసంగాన్ని యావత్ దేశానికి అందించాలనే ఆలోచనతో చంద్రబాబు దేశ ప్రధానిని ఆహ్వానించారన్నారు.ఉమ్మడి కర్నూలు జిల్లాలో అనేక పరిశ్రమలు, పెట్టుబడులు వస్తున్న క్రమంలో ప్రధాని చేతుల మీదుగా వాటిని ప్రారంభించే లక్ష్యంతో ఇక్కడ ఏర్పాటు చేశారన్నారు. ఈ సభకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి దాదాపు 3 లక్షల మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలిరానున్నారన్నారు.మహానాడుకు మించి భారీగా జన సమీకరణ చేపట్టి సక్సెస్ చేసేందుకు కృషి చేయాలన్నారు.గ్రామాల వారీగా ఎన్ని బస్సులు, ఏ టైంలో ప్రారంభమవుతాయనే విషయంలో అధికారులు ఏర్పాటు చేస్తున్నారని, వారికి సహకారంగా మనమంతా నిలబడాలన్నారు. సభకు తరలివచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది రవాణా, ఆహార సదుపాయం ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు.రాబోయే ఐదు రోజులు తామంతా కర్నూలులోనే ఏర్పాట్లలో నిమగ్నమై ఉంటున్న నేపథ్యంలో స్థానిక నాయకులు కార్యకర్తలు బాధ్యతలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో కూటమి నాయకులు కార్యకర్తలు బాధ్యతగా కలిసికట్టుగా పని చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ నేతలు బూత్, యూనిట్ క్లస్టర్ స్థాయిలో తమ పరిధిలో జన సమీకరణకు కృషి చేయాలని, ప్రధాని బహిరంగ సభను కూటమి నేతలు, కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# నంద్యాలలో ఒక్కరు వెళ్తున్నారా అంతే సంగతులు..!

**– 3.30టూ 4.30 గంటల సమయం..**

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణం అభివృద్ధి చెందేకొద్ది దొంగతనాలు, దారిదోపిడీలు కూడా పెరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. గతంలో అర్ధరాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడే వారు ఇటీవల కాలంలో తెల్లవారుజామున 3.30గంటల నుంచి 4.30గంటల మధ్యలో వాకింగ్, టీ కొట్లు, కూరగాయల మార్కెట్‌కు వెళ్లే వారిని లక్ష్యంగా చేసుకుని కొందరు యువకులు కాపుకాచి దాడి చేస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తెల్లవారే సమయంలో చాలా మంది ఏదైనా ఊర్లకు బస్టాండ్‌కు వాకింగ్‌తో నడుచుకుంటూ బస్టాండ్‌కు వెళ్తుంటారు. ముఖ్యంగా బస్టాండ్ నుంచి బైర్మల్ వీధి నుంచి కల్పనాసెంటర్ మీదుగా పెద్దమార్కెట్‌కు రైతులు, కూరగాయల వ్యాపారం చేసేవారు మార్కెట్‌కు వెళ్లి ఆటోలలో, రిక్షాలలో సరుకులను తీసుకుని వెళ్తుంటారు. అయితే కొద్ది రోజుల నుంచి కొంతమంది యువకులు ఆ సమయంలో అటువైపు వెళ్లేవారిని అడ్డగించి డబ్బులు ఇవ్వకుంటే వారిని గాయపరిచి దాడులు చేస్తున్నారని పేర్కొంటున్నారు. వన్‌టౌన్‌కు కూతవేటు దూరంలో కల్పనాసెంటర్ వద్ద రెండు రోజుల క్రితం ఒక వృద్ధుడు వ్యాపార నిమిత్తం తెల్లవారుజామున 4గంటలకు బైర్మల్ వీధిలోని యూనియన్ బ్యాంక్ వద్ద మీదుగా వెళ్తుండగా ఇద్దరు యువకులు వృద్ధుడిపై దాడిచేసి గాయపరిచి అతని వద్ద నుంచి రూ.3వేలు దోచుకుని వెళ్లారు. అదే ప్రాంతంలో తెల్లవారు జామున ఒక టీ కొట్టు యజమానిని కూడా బెదిరించి నగదు లాక్కుని వెళ్లినట్లు తెలిసింది. ఆ సమయంలో వీధిలైట్లు లేని ప్రాంతాన్ని చూసి దాడులకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. ఇదే సమయంలో అదునుచూసి దాడులకు పాల్పడుతుండడంతో ఆ యువకులను ఎవరు గుర్తుపట్టడం లేదని పేర్కొంటున్నారు. ఒక్కరు వెళితే మాత్రం వారి పనిఅయిపోయినట్లే అని పలువురు ఆందోళనకు గురవుతున్నారు. ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో అర్థం కాని పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీస్ శాఖ తెల్లవారు జామున గట్టి నిఘా ఏర్పాటు చేసి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

# నిర్మించారు.. వదిలేశారు.. ప్రభుత్వ నిధులు వృధా..!

**– నిర్లక్ష్యపు నీడలో వ్యవసాయ అధికారులు**

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** గత ప్రభుత్వంలో స్థానిక పట్టణంలో డిగ్రీ కళాశాల దగ్గర రైతు భరోసా కేంద్రం –2ను రూ.21లక్షల వ్యయంతో నిర్మించారు. నిర్మాణం పూర్తయినప్పటికీ వ్యవసాయ అధికారులు పట్టించుకోకుండా గాలికి వదిలేశారని ప్రజలు పలు రకాలుగా ఆరోపణలు చేస్తున్నారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉండి రైతులకు సేవలు అందించాల్సిన రైతు సేవా కేంద్రం–2 ప్రారంభానికి నోచుకోక నిరూపయోగంగా పడి ఉండడంతో చుట్టు ప్రక్కల ప్రాంతమంతా చెట్లు పెరిగి, ముళ్లకంపలు చెత్తచెదారం అంతా పేరుకుపోయింది. అక్కడే ప్రజలు మల,మూత్ర విసర్జన చేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతుందని స్థానిక ప్రజలు తెలిపారు. వ్యవసాయ అధికారుల నిర్లక్ష్య ధోరణి వలనే రైతు సేవా కేంద్రం ప్రారంభానికి నోచుకోక ఈ దుస్థితి ఏర్పడిందని రైతులు విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వ నిధులు రూ.లక్షలు వృధా అవుతున్న వ్యవసాయ అధికారుల్లో ఏమాత్రం చలనం లేదని వాపోతున్నారు. ఈ విషయంపై పలుమార్లు పత్రికల్లో ప్రచురించిన వ్యవసాయ అధికారులకు మాత్రం చీమ కుట్టినట్లయిన లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. పత్తికొండ డివిజన్ కేంద్రంలో డివిజన్ స్థాయి అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి రైతు సేవా కేంద్రం రెండును ప్రారంభించి రైతులకు ఉపయోగపడేలా చూడాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు. కాంట్రాక్టర్ నిర్మాణం పూర్తి చేసి మండల వ్యవసాయ అధికారికి అప్పజెప్పినట్లు గతంలోనే పంచాయతీరాజ్ శాఖ ఏఈ తెలిపారు. ఈ విషయంపై ఏడిఏ మోహన్ విజయ్ కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా, గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాన్ని నిర్మించిన తరువాత ప్రభుత్వం మారిపోయిందని వివరణ ఇచ్చారు.




# నంద్యాల చెంత కామధేను సిరి సంత




మాట్లాడుతున్న రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నవనందుల నంద్యాల చెంత కామధేను సిరి సంతను ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రారంభించడం అభినందనీయమని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. ఆదివారం నంద్యాల మార్కెట్ యార్డు ఆవరణంలో ప్రకృతి వ్యవసాయ ఆధారిత గో సంత స్టాళ్ళను ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమం చైర్మన్ గుంటుపల్లి హరిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో నే ఆరోగ్యకర సమాజ నిర్మాణం సాధ్యమని ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించి వాటిని ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందులు లేని ఆహారం మన ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి కట్టుబడి ఉందన్నారు. రతులు ఈ విధానంలో సాగుచేసి ప్రజలకు స్వచ్ఛమైన ఆహారాన్ని అందించాలని పిలుపునిచ్చారు. గో ఆధారిత వ్యవసాయం వల్ల భూసారం పెరుగుతుందని పర్యావరణ సమతుల్యత కాపాడబడుతుందని పేర్కొన్నారు. నంద్యాల జిలా రైతులు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల సాగులో ముందుండాలన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించడంలో మార్కెట్ యార్డు పూర్తి సహకారాన్ని అందిస్తుందని ఈ సంత ద్వారా రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించేందుకు మంచి వేదిక లభించిందన్నారు. ఈ సంతలో వివిధ రకాలైన గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, దేశవాళీ వంగడాలు, కాయగూరలు, చిరుధాన్యాలు, ఆయుర్వేద ఉత్పత్తులు ప్రదర్శనకు, అమ్మకానికి ఉంచారు. రైతులు , స్వయం సహాయక బృందాలు ఏర్పాటు చేసిన స్టాళ్ళను మంత్రిని పరిశీలించి రైతులతో, వినియోగదారులతో మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఎస్‌పికె ప్రచార సాధకులు ప్రకృతి వ్యవసాయ నిపుణులు విజయరాం, నంద్యాల మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రంగప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త పబ్బతి వేణు, డిపిఎం ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు, ఏడిపిఎం ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు అబ్దుల్ సలామ్, కామధేను సిరిసంత వ్యవస్థాపకులు కర్రెద్దుల బాలమద్దిలేటి, సుబ్బారావు, ధనుంజయరెడ్డి లత, అయ్యలూరు టీడీపీ అధ్యక్షులు త్రిలింగేశ్వరరెడ్డి, వ్యవసాయమార్కెటింగ్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.